రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త






## కూలుతున్నా కళ్లు తెరవరా!

**శిథిలావస్థలో పురాతన భవనం గోడలు**
**ప్రమాదం అంచున బాటసారులు**

**నందిగామ, అక్టోబరు 26 ప్రభాతవార్త :** నందిగామ మండల కేంద్రంలో ఉన్న సత్తయ్య ఇంటి పాత గోడలు భారీ వర్షాలకు గోడలు తడిసి తడిసి పగుళ్ళ ఏర్పడి ప్రమాదంగా మారింది. పురాతన ఏళ్ల నాటి ఇల్లు శిథిలావస్థకు చేరుకుందని, తొలగించామని ఇంటి యజమానిని కోరిన పట్టించుకోవడం లేదని చుట్టుపక్కల వారు వాపోతున్నారు. ఈ పాత గోడలతో ఎప్పుడు ఏం ముప్పు వాటిల్లుతుందో నేమో అని భయం గుప్పెట్లో బిక్కుబిక్కు మంటున్నారు.


5కె రన్‌లో పాల్గొన్న కలెక్టర్

## అనంతగిరిలో కలెక్టర్ రన్

**ఆరోగ్యంపై అందరూ దృష్టి సారించాలని పిలుపు**

**ఎకో అర్బన్ పార్క్ పరిశీలన**

**పనులు వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**

**వికారాబాద్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** ప్రతి మనిషి ఆరోగ్యాంగా ఉంటేనే జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. ఆదివారం ఉదయం అనంతగిరిలో తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ మొదటిసారిగా ట్రయిల్ రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలొన్న కలెక్టర్ మాట్లాడుతూ, మనిషి జీవితంలో ఆరోగ్యమే ప్రధానమని, దేశ శ్రేయస్సు ఆరోగ్యకరమైన జనాభా పై ఆధారపడి ఉంటుందని తెలిపారు. అనంతగిరి అటవీ ప్రాంతం ఔషధ మొక్కలకు నిలయమని, ఇక్కడి గాలి ఆరోగ్యాన్ని మరింత మెరుగుపరుస్తుందని అన్నారు. ఈ ప్రాంతములో తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ట్రయల్ రన్ నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో వెయ్యి మందికి పైగా తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. నిర్వాహకులు 5 కి.మీ, 10 కి.మీ, 20 కి.మీ, 32 కి.మీ రన్ నిర్వహించి పథకాలు బహుకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అనంతగిరి ఎకో అర్బన్ పార్క్ అభివృద్ధి ప నుల ం పరిశీలించారు. ఎంట్రీ గేట్ బాగుందని ప్రశంసిస్తూ, ప నులలో వేగం పెంచాలని అధికారుల ం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, అడిషనల్ ఎస్పి రామునాయక్, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రన్నర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జగన్, హరీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

## రూ.4 కోట్ల గంజాయి పట్టివేత



**రంగారెడ్డి అర్బన్ అక్టోబరు 26, ప్రభాతవార్త:** గుట్టు చప్పుడు కాకుండా అక్రమంగా విదేశాల నుండి హైడ్రోపోనిక్ గంజాయిని అక్రమ రవాణా చేస్తూ డిఆర్ఐ అధికారులకు పట్టుబడ్డ ఘటన శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. డిఆర్ఐ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం విదేశాల నుండి గంజాయి అక్రమ రవాణా చేస్తున్నారన్న పక్క సమాచారంతో ఆదివారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డిఆర్ఐ అధికారులు తనిఖీలు ఓ వ్యక్తి బ్యాంకాక్ నుంచి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి వస్తున్న ప్రయాణికుడిపై అనుమానం వచ్చి అతని అడ్డుకుని అతని లగేజీ బ్యాగ్ ను తనిఖీ చేయగా బ్యాగ్‌లో అడుగు భాగంలో ముద్ద రూపంలో ఆకుపచ్చ రంగు పదార్థాన్ని కలిగి ఉన్న ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆ ముద్ద పదార్థాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా అది హైడ్రోపోని గంజాయిగా డిఆర్ఏ అధికారులు నిర్ధారించారు. ప్రయాణికుడి నుండి 4.15 కోట్ల విలువ చేసే 4.15 కిలోల హైడ్రోఫోనిక్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్డిపిఎస్ చట్టం కింద ప్రయాణికుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కీచక టీచర్‌పై వేటు

**సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ**

**తాండూరు, అక్టోబరు 26, ప్రభాతవార్త :** తాందూరు మండలం కరణ్‌కోట్ జెడ్పిహెచ్ఎస్ స్కూల్ టీచర్ రాఘువేందర్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసినట్లు తాండూరు మండల విద్యాధికారి వెంకటయ్యగౌడ్ తెలిపారు. టీచర్ రాఘవేం దర్‌రెడ్డి అదే పాఠశాలలో చదువుతున్న విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ సంఘటనపై జిల్లా విద్యాధికారి రేణుకాదేవి విచారణకు ఆదేశించడంతో ఎంఈఓ వెంకట య్యగౌడ్ కరణ్‌కోట్ జెడ్పిహెచ్ఎస్ స్కూల్‌లో విచారణ చేపట్టారు. ఈ నివేధిక జిల్లా విద్యాధి కారికి పంపించారు. బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన టీచర్ రాఘవేందర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఎంఈఓ వెంకటయ్యగౌడ్ తెలిపారు. సోమవారం ఉత్తర్వులు అందజేయడం జరుగుతుందని చెప్పారు.



# కపాస్ యాప్ తిప్పాదియ్యా..

**రంగారెడ్డి అర్బన్, అక్టోబరు 26, ప్రభాత వార్త:** తెల్ల బంగారంగా ప్రసిద్ధి చెందిన పత్తి పంటను రైతుల వద్ద నుండి కొనుగోలు చేసేందుకు రంగారెడ్డి జిల్లాలో అన్ని ఏర్పాట్లూ పూర్తయ్యాయి. కొన్ని చోట్ల



ఇప్పటికే కొనులు కేంద్రాలు ప్రారం భించగా.. మరికొన్ని చోట్ల సన్నాహాలు పూర్తి చేశారు. తేమశాతం అధికంగా ఉండటంతో ఇంకా కొనుగోళ్లు ప్రారంభం కాలేదు. తలకొండపల్లి మండల కేంద్రంలోని శ్రీనివాస మురుగన్ జిన్నింగ్ మిల్లులో సోమవారం సీసీఐ నుంచి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రారంభించనున్నారు.

రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఈ యేడాది ఖరీఫ్ సీజన్‌లో 3.5 లక్షల ఎకరాలకు పైగా పత్తి పంట సాగైంది. ఇందులో దాదాపు దాదాపు 30 లక్షల క్వింటాళ్లకు పైగా దిగుబడి రావచ్చని అధికా రులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పత్తి కొనుగోళ్లకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కూడా సంబంధిత అధికారులకు ఆదేశాలివ్వడంతో జిల్లా వ్యాప్తంగా అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

### స్లాట్ బుక్ చేసుకుంటేనే కొనుగోళ్లు

ఇదిలా ఉంటే ఈసారి పత్తి కొనుగోళ్లలో సీసీఐ పలు మార్పులు తీసుకువచ్చింది. గతానికి భిన్నంగా ఈసారి యాప్‌లో స్లాట్ బుక్ చేసుకొని పత్తిని మిల్లుకు తీసుకుపోవాల్సి ఉంటుంది. స్లాట్ బుక్ చేసుకోకుంటే పత్తిని కొనుగోలు చేయరు. గతంలో రైతులు నేరుగా సీసీఐ కొనుగోలు కేంద్రానికి పత్తిని తీసుకువచ్చి అమ్ముకునేవారు. వ్యవసాయశాఖ నమోదు చేసే పంటల వివరాల్లో పత్తి విస్తీర్ణం ఉంటే సరిపోయేది. ప్రస్తుతం పత్తి కొనుగోళ్లను యాప్ ద్వారానే చేపట్టాలని సీపీఐ నిర్ణయించింది. మూడు రోజుల ముందు స్లాట్‌బుక్ చేసి రైతులు కపాస్ కిసాన్ యాప్‌లో తమ సమీప వ్యవసాయ మార్కెట్, జిన్నింగ్ మిల్లును ఎంచుకోవాలి. పత్తి విక్రయానికి స్లాట్ తేదీలు కనిపిస్తాయి. బుక్ చేసిన తేదీన జిన్నింగ్ మిల్లుకు రైతు పత్తిని తీసుకుపోవాలి. అప్పుడే సీసీఐ పత్తిని కొనుగోలు చేస్తుంది. స్లాట్ బుక్ చేసుకోకుంటే కొనుగోలుకు అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

### తెల్లబంగారం కొనుగోళ్లకు సిసిఐ కొత్త మెలిక

- యాప్‌లో స్లాట్ నమోదు చేసుకుంటేనే కొనుగోళ్లు
- జిల్లాలో 12 చోట్ల కొనుగోలు కేంద్రాలు
- 1.6 లక్షల మంది పత్తి రైతులు
- ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నంబరుతోనే నమోదు ప్రక్రియ
- రైతులకు లాగిన్, పాస్‌వర్డ్, ఒటిపి వంటి సాంకేతిక అంశాలపై అవగాహన లేమి
- అయోమయంలో అన్నదాతలు
- ఆండ్రాయిడ్ ఫోన్ లేని వారి పరిస్థితి ఏంటి?
- కొనుగోలు కేంద్రంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించాలని డిమాండ్

### సాగు వివరాల నమోదు తప్పనిసరి

పేరు, ఊరు, భూమి, సర్వే నంబరు, ఎన్ని ఎకరాలలో పంటను సాగు చేశారనే వివరాల నమోదు ప్రక్రియ రైతులు ఆధార్ లింక్ ఉన్న మొబైల్ నంబరుతోనే తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. జిల్లాలో పత్తి రైతులు 1.6 లక్షల మంది ఉండగా.. వారిలో ఒక వంతు కూడా యాప్‌లో వివరాలను నమోదు చేసుకోలేదని తెలుస్తోంది. మరోవైపు అధికారులు కూడా రైతులకు ఈ కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్న దాఖలాలు కనిపించటంలేదు.

### సాంకేతిక పరిజ్ఞానం లేక... ముప్పుతిప్పలు

వెబ్సైట్/యాప్ లోడ్ అవ్వడంలో ఆలస్యం లేదా క్రాష్ అవ్వడం, వినియోగదారుల లాగిన్, పాస్‌వర్డ్ సమస్యలు వంటి సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతుండటంతో రైతుల్లో గందరగోళం నెలకొంటోంది. మొబైల్ నెంబర్లు మార్చిన రైతులకు యాప్‌లో లాగిన్ అవ్వడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆధార్ నెంబరు, ఓటీపీ ద్వారా యాప్‌లో లాగిన్ అయ్యే అవకాశం కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్నా గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక పరిజ్ఞానం లేక రైతులు దిక్కులు చూడాల్సి వస్తోంది. ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులు ఏమి చేయాలో తెలియని స్థితిలో ఉన్నారు.

### జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలు

జిల్లాలోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలు 12 ఉన్నాయి. రాఘవేంద్ర కాటన్ కార్పొరేషన్ (చిలకమ్రి, ఫరూక్ నగర్ మండలం), దోడియా ఆగ్రోఇండస్ట్రీస్ (చిలకమ్రి, ఫరూక్‌నగర్ మండలం), గౌరవ్ ఇండస్ట్రీస్ (సోలిపూర్, ఫరూక్ నగర్ మండలం) తిరుమల ట్రేడింగ్ కంపెనీ (నందిగామ) హరిహర జిన్నింగ్ ప్రెస్సింగ్ ప్రైవేట్ లిమిటెడ్ (నందిగామ) తుల్జా భవానికాటేక్స్ (నందిగామ), శ్యాంకాటేక్స్ ఇండియాప్రైవేట్ లిమిటెడ్ (పరిగి రోడ్డు ఎలికట్ట), శ్రీనివాస కాటన్ ఇండస్ట్రీస్ (వనంపల్లి, కొందుర్గు మండలం), సూపర్ కాటన్ జిన్నింగ్ ప్రెస్సింగ్ (వనంపల్లి, కొందుర్గు మండలం), ఎన్డిటి కాటన్ ఇండస్ట్రీస్, కిసాన్ జిల్లింగ్ ప్రెస్సింగ్ ఇండస్ట్రీస్ (ఆకుతోటపల్లి, అమన్‌గల్ మండలం) శ్రీ అభిషేక కాటన్ మిల్స్ (పోలేపల్లి , అమన్‌గల్ మండలం), శ్రీనివాస మురుగన్ ఇండస్ట్రీస్ (తలకొండపల్లి).

### ఆండ్రాయిడ్ ఫోన్ లేని వారి పరిస్థితి ఏంటి?

పత్తిని సాగు చేసిన రైతులు సీసీఐ తీసుకొచ్చిన కొత్త నిబంధనలతో ఆందోళన చెందుతున్నారు. కపాస్ కిసాన్ యాప్‌పై వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పిస్తున్నప్పటికీ రైతులు అయోమయానికి గురవుతున్నారు. ఆండ్రాయిడ్ ఫోన్ లేని రైతులు ఏమి చేయాలో తెలియని స్థితిలో ఉన్నారు. అన్ని ఉన్న రైతులు అవగాహన లేక యాప్‌లో తమ వివరాలను నమోదు చేయలేక పోతున్నారు.

### కౌలురైతులకు యాప్‌లో నో ఛాన్స్?



కౌలురైతులకు యాప్‌లో ఎలాంటి స్థానం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. బహిరంగ మార్కెట్లో పత్తి ధర బాగా పడిపోగా మద్దతు ధర కోసం సీసీఐకి పత్తి అమ్ముకోవాల్సిన సందర్భంలో యాప్ ద్వారా కొనుగోళ్ల రైతులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

### యాప్ వినియోగం ఇలా..

- కాపాస్ కిసాన్ మొబైల్ యాప్‌ను రైతు యొక్క మొబైల్ ఫోన్లో ప్లేస్టోర్‌లో డౌన్లోడ్ చేసుకోవాలి.
- వ్యవసాయ శాఖ క్రాప్ బుకింగ్‌లో అనుసంధానం కాబడిన రైతు యొక్క ఫోన్ నెంబర్‌ను నమోదు చేయగానే మెసేజ్ ద్వారా ఫోన్‌కు ఓటీపీ వస్తుంది.
- ఓటీపీనీ నమోదు చేసి స్లాట్ బుకింగ్ చేసుకోవాలి.
- స్లాట్ బుకింగ్‌లో జిల్లా పేరు, మార్కెట్ పేరు, పత్తిని అమ్మే మిల్లు పేరు, పత్తి పరిమాణము, తేదీ, సమయము ఎన్నుకొని నమోదు చేయాలి.
- వాట్సాప్ ద్వారా చాట్

మిగతా 4లో

## పెద్దేముల్ మండలంలో డ్రోన్‌ల కలకలం

**పలు గ్రామాల్లో చక్కర్లు**
**ఆందోళనలో స్థానికులు**



4

## ప్రైవేటు ట్రావెల్స్‌లో పేలుడు పదార్థాలు ?

- గనుల్లో పేల్చే డిటోనేటర్లు
- లగేజీ బ్యాగుల్లో చుట్టి గుట్టుచప్పుడు కాకుండా రవాణా
- నిషేధం ఉన్న ఎలక్ట్రానిక్ గూడ్స్ తరలింపు
- హైవే రోడ్లపై అమలు కాని నిబంధనలు
- ట్రావెల్స్ బస్సులపై నిఘా కరువు



**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కర్నూలు బస్సు ప్రమాదంతో మూడు రాష్ట్రాల ప్రభుత్వాలు మేల్కొన్నాయి. తెలంగాణ నుంచి బయలుదేరిన బస్సు కర్నాటకకు వెళుతుండగా ఏపీలో ప్రమాదానికి గురి కావడం తెలిసిందే. ప్రమాదంలో పెద్ద ఎత్తున ప్రయాణికులు మృత్యువాత పడ్డారు. సంఘటన జరిగిన కొద్ది గంటల వ్యవధిలోనే రవాణా, పోలీసుశాఖల అధికారులు ట్రావెల్స్ పై దాడులు నిర్వహించారు. తెలంగాణలో పెద్ద సంఖ్యలో బస్సులు నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించారు. కర్నూలు ప్రమాదానికి గురైన ట్రావెల్స్ బస్సు పలుమార్లు నిబంధనలు ఉల్లంఘించినట్లు, పెండింగ్ చాలానాలు ఉండటం అధికారుల పనితీరుకు

మిగతా 2లో

## శ్రీశైలంకు రైతునేస్తం పురస్కారం

**ఘట్‌కేసర్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ అంకుశాపూర్‌కు చెందిన రైతు పిట్టల శ్రీశైలంకు రైతునేస్తం పురస్కారం


మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మంత్రి నాగేశ్వరరావు చేతుల మీదుగా రైతునేస్తం పురస్కారం అందుకుంటున్న శ్రీశైలం

లభించింది. 'రైతు నేస్తం' 21వ వార్షికోత్సవం సందర్భంగా ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ ఐవీ.సుబ్బారావు పేరిట వ్యవసాయ రంగంలో విశేష కృషి చేసిన పలువురు రైతులకు రైతునేస్తం పురస్కారాలు-2025ను మాజీ ఉపరాష్ట్రపతి

మిగతా 4లో

## 15 రోజులుగా నీళ్లు లేవ్

**గాజీపూర్‌లో తాగు నీటి గోస**

**బోరుమోటారు రిపేర్ చేయడం లేదని గ్రామస్తుల ఆగ్రహం**

**ఎమ్మెల్యే జోక్యం చేసుకోవాలని వినతి**

**పెద్దేముల్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** పెద్దేముల్ మండలం గాజీపూర్ గ్రామంలో తాగునీటి కోసం 15 రోజులుగా అల్లాడుతున్న తమను పట్టించుకునేనాథులే లేరని గ్రామస్థులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గాజీపూర్ గ్రామంలోని వార్డు నెంబర్ 1 బోనమ్మ గుడి ప్రాంతంలో బోరుమోటారు పాడైపోయి 15 రోజులు కావస్తున్న పంచాయతీ కార్యదర్శి అటువైపు కన్నెతి చూడడంలేదని వాపొతున్నారు. ఇట్టి విషయాన్ని పంచాయతీ కార్యదర్శికి న్నవిస్తే నాయకులు చెబితేనే బోరుమోటారు మరమ్మత్తులు చేయిస్తానని ప్రజలపై మండిపడుతున్నారని ఆరోపిస్తున్నారు. గత 15 రోజులుగా తాగునీటి కోసం అవస్థలు పడుతున్న తమను ఎవరు పట్టించుకోవడంలేదని, ఎమ్మెల్యే కనికరించి తాగునీటి సమస్య పరిష్కరించేందుకు కృషిచేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న స్థానికులు

**పంచాయతీ కార్యదర్శి వివరణ :-** గత పదిహేను రోజులుగా తాగునీరు రావడంలేదని పంచాయతీ కార్యదర్శి సుశీలను వివరణ కోరగా ఇంతకు ముందు బోరు మోటారు కాలిపోయినప్పుడు రూ. 6 వేలు ఖర్చు పెట్టడం జరిగిందని, ప్రస్తుతం కేసింగ్, బోరుమోటారు ఇరుక్కుందని, వాటిని తీసి ప్రెస్సింగ్ చేయడానికి సుమారు రూ.60 వేల వరకు ఖర్చు అవుతుందని, అందుకు సోమవారం గ్రామసభ నిర్వహించి సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వివరణ ఇచ్చారు.

మిగతా 4లో

## షాద్‌నగర్ రహదారులకు మహర్దశ

**కోట్లాది రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు టెండర్లు ఆహ్వానం**
**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**షాద్‌నగర్, అక్టోబరు 26, ప్రభాతవార్త :** షాద్‌నగర్ నియోజకవర్గంలో ఆయా ముఖ్యమైన గ్రామాలకు వెళ్లే రహదారులకు మోక్షం లభించనుంది. ప్రత్యేక నిధులతో వాటిని అభివృద్ధి చేస్తున్నట్లు షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ వెల్లడించారు. ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ ప్రత్యేకంగా మాట్లాడుతూ రోడ్ల గురించి ప్రస్తావించారు. ఎన్ హెచ్ 44 నుంచి వీర్లపల్లి వరకు హెచ్ఎండిఏ నిధుల నుంచి 10 కోట్లు మంజూరు అయ్యాయనీ ఇది బీటీ డబుల్ రోడ్డు అని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా రూ. 30 కోట్ల నిధులతో కొత్తూరు నుండి మామిడిపల్లి వరకు, రూ.15 కోట్లతో నందిగామ నుంచి నర్సప్పగూడ మీదుగా చెగూరు వరకు, రూ.14 కోట్లతో హాజిపల్లి నుండి అయ్యవారి పల్లి వరకు విస్తరణ పనులతో పాటు, రూ. 18 కోట్ల తో కొందుర్గు నుండి కొల్లూరు మీదుగా నవాబ్ పేట వరకు, రూ 19 కోట్లతో కొత్తూరు నుండి కేశంపేట వరకు బీటీ రోడ్ల విస్తరణ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధించిన టెండర్లను కూడా ఆహ్వానించినట్లు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, పట్టణ అధ్యక్షుడు చెన్నయ్య, మాజీ కౌన్సిలర్ రాజేందర్ రెడ్డి, మహమ్మద్ ఇబ్రహీం, చెంది తిరుపతి రెడ్డి, రఘునాయక్, శ్రీను నాయక్, లింగారెడ్డిగూడెం అశోక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## నీటిగుంతలో పడి ఇద్దరు విద్యార్థినుల మృతి

**-శవాలను వెలికితీసిన ఫైర్, రెస్క్యూ సిబ్బంది**
**-అక్కాచెలెళ్ల మృతితో కుటుంబంలో విషాదం**



**ఘట్‌కేసర్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి ఇద్దరు విద్యార్థినులు మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీనగర్ ప్రశాంత్‌నగర్‌లో ఉన్న క్వారీ గుంతలో వర్షపునీరు చేరి లోతైన నీటిగుంతగా మారింది. అంకుశాపూర్‌కు చెందిన కొండల మల్లేశ్ కుమార్తెలు హరిణి (16), గాయత్రీ (13)లు నీటిలో మునిగి చనిపోయారు. ఆదివారం సెలవు కావడంతో మేతకు వెళ్లిన తమ పశువులను తీసుకురావడానికి సాయంత్రం అక్కాచెల్లెళ్లు హరిణి, గాయత్రీలు వెళ్లగా ప్రమాదవశాత్తు నీటిగుంతలోకి జారి పడి మునిగిపోయారు. స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఫైర్, రెస్క్యూ సిబ్బంది చేరుకొని బాలికల కోసం నీటిగుంతలో గాలింపు జరిపారు. రాత్రి 10:30 గంటలకు ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. కుటుంబసభ్యుల సమక్షంలో శవపంచనామా చేసిన పోలీసులు పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అంకుశాపూర్‌కు చెందిన కొండళ్ల మల్లేశ ఎన్ఎఫ్‌సీనగర్ ప్రశాంత్‌నగర్ దగ్గర ఇళ్లు నిర్మించుకొని కుటుంబంతో కలిసి పశుపోషణ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తాను నివాసం ఉండే ఇంటికి సమీపంలోనే గుంతలో పడి ఇద్దరు కుమార్తెలు మృతిచెందడంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపిస్తున్నారు. మృతిచెందిన హరిణి (16) ఎన్ఎఫ్‌సీనగర్‌లోని కేంద్రీయ విద్యాలయలో ఇంటర్ చదువుతుండగా గాయత్రీ (13) ఘట్‌కేసర్‌లోని హోలీఫెయిత్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నది. ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి, ఎస్ఐలు బి.ప్రభాకర్‌రెడ్డి, శేఖర్‌లు ఫైర్, మున్సిపల్ సిబ్బంది సహకారంతో ఇద్దరి శవాలను బయటకు తీయించారు. కేసుదర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.



ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే శంకర్

## ఏ భాయ్ జర దేక్ కే ఛలో..!

**జూబ్లీహిల్స్‌లో బిఆర్ఎస్ పీడ విరగడ చేద్దాం**

**షాద్‌నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్" పిలుపు**

**షాద్‌నగర్, అక్టోబరు 26 ప్రభాతవార్త:** ఏ భాయ్ జర దేక్ కే ఛలో.. ఎలక్షన్ మే కాంగ్రెస్ పార్టీకో జీతావ్.. అక్కా.. నవీన్ యాదవ్ గెలుపు జూబ్లీహిల్స్ గెలుపు అభివృద్ధికి మలుపు అంటూ కరపత్రాలు పట్టుకొని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యూసుఫ్ గూడ డివిజన్‌లో కృష్ణానగర్‌లో బూత్ నెంబర్ 248 249లో ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే శంకర్ ఆదివారం పాల్గొన్నారు. స్థానిక నాయకులతో పాటు షాద్ నగర్ నియోజకవర్గం చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వెంట హాజరయ్యారు. ఈ సందర్భంగా యూసుఫ్ గూడా డివిజన్ కు ఇన్చార్జిగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తనదైన శైలిలో ముమ్మర ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. ప్రచారంలో ప్రజలను తనదైన శైలిలో కలుసుకొని గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ వారి అక్రమాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. ముఖ్యంగా నవీన్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మరింత సంక్షేమం అభివృద్ధి పెరుగుతుందని అనవసరంగా ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేస్తే అభివృద్ధి జరగదని ప్రజలు విజ్ఞతతో ఓటు వేయాలని కోరారు. తెలంగాణలో జరుగుతున్న ఈ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ను గెలిపించి తద్వారా ప్రజలకు మంచి సందేశాన్ని అందించాలని బిఆర్ఎస్ పార్టీ పీడ విరగడ చేయాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. గెలిచాక ప్రజలకు ముఖం చూపించలేని కేసీఆర్ తన అభ్యర్థిని గెలిపించి అభివృద్ధికి ఎలా సహకరిస్తారని ఫామ్హౌస్ వ్యవహారాల తప్ప మరో రాజకీయం ఉండదని అభివృద్ధి ఉండదని విమర్శించారు. ఇప్పటికే అధికారం కోసం పార్టీ పట్టు కోసం కేసీఆర్ కుమారుడు కేటీఆర్ అదేవిధంగా చెల్లెలు కవిత పోట్లాడుతుంటే మరోవైపు హరీష్ రావు, సంతోష్ రావులు కూడా అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారని కుటుంబ పార్టీని గద్దెనెక్కిస్తే జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏమవుతుందని రాష్ట్రంలో ప్రజలు బాగా ఆలోచించి కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని ఇప్పుడు కూడా నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి పత్రం కడితే ఈ ప్రాంతం మొత్తం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే శంకర్ ప్రచారం చేశారు. ఆటో డ్రైవర్లు ఇతర ప్రజలు అందరినీ కలిసిన ఎమ్మెల్యే శంకర్ "ఏ భాయ్ జర దేక్ కే ఛలో.. ఓట్ కాంగ్రెస్ కో దాలో" అంటూ తనదైన శైలిలో ప్రజలను ప్రచారంలో పలకరించారు.

### పౌల్ట్రీ రైతులకు ఊరట కల్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం

**రూ. 5.50 కోట్ల పౌల్ట్రీ పన్నుల బకాయిల రద్దు**

**షాద్‌నగర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** ఎదుటి వారిపై ప్రేమ, మనసు ఉంటే మార్గం ఉంటుంది..చేయాల్సి న పనిపై శ్రద్ధ, ఆసక్తి, పట్టుదల నిర్దేశించుకుని లక్ష్యాన్నిసాధించగలిగితే చేయనిదంటు ఏమీ లేదనీ రాష్ట్ర ప్రభుత్వం పౌల్ట్రీ రైతుల విషయంలో పూర్తి న్యాయం చేసిందని రైతుల పట్ల ప్రజా ప్రభుత్వానికి ఉన్న నిదర్శనం ఇదేనని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలో సుమారు వందమందికి పైగా పౌల్ట్రీ రైతుల మున్సిపల్ పన్నుల విషయంలో రూ.5 కోట్ల 50 లక్షల 9వేల 434ఎత్తివేయడంతో స్థానిక బివి రావు నగర్ పౌల్ట్రీ రైతాంగం వెంకటనారాయణ, రామారావు, వసంతరావు తదితరులు ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి తరలివచ్చారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తదితర స్థానిక నాయకులను పౌల్ట్రీ రైతులు భారీ శాలువా పుష్పగుచ్ఛాలు ఎమ్మెల్యే శంకర్ కు ఇచ్చి సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా ఇదో గొప్ప సంచలన నిర్ణయం అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆనందం వ్యక్తం చేశారు. పౌల్ట్రీ పన్నులు ఐదున్నర కోట్లు ఎత్తివేయడానికి సహకరించిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అదేవిధంగా బట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కమిషనర్ టికె శ్రీదేవిలకు రైతాంగం తరపున ప్రత్యేక ధన్యవాదాలు ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వం రాజకీయంగా పోటీ రైతుల విషయంలో అరాచకం సృష్టించిందని వారిని రాజకీయ పావులుగా వాడుకొని సమస్య పరిష్కారం కాకుండా చేసిందని విమర్శలు గుప్పించారు. రైతులు అందరి పక్షమని, కష్టపడి పనిచేసే ప్రభుత్వాలపై ఆధారపడకుండా వాళ్ల పని వాళ్లు చేసుకుంటూ ఉంటారని అలాంటివారిని రాజకీయ రొంపిలో దింపి తమ రాజకీయ పదం కడుపుకున్నారని గత ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. రైతులపై ప్రేమ మనసు ఉంటే సమస్య పరిష్కారం అవుతుందని ఊరికే ప్రేమ నటించే వారితో ఏం న్యాయం జరుగుతుందని అన్నారు. రైతులను రాజకీయాల్లోకి లాగాకూడదని వారికి స్వేచ్ఛ కల్పించాలని ఎమ్మెల్యే అన్నారు. గత ప్రభుత్వం పనుల విషయంలో రైతులపై కేసులు వేశారని ఇది చాలా దారుణమని ఆ కేసుల అంశాన్ని కూడా ప్రభుత్వంతో మాట్లాడి వాటిని ఎత్తివేస్తామని అన్నారు. బివి రావు నగర్ పౌల్ట్రీలో 50 లక్షల రూపాయలు మంజూరు చేసి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తానని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. గత ప్రభుత్వ వైఫల్యం వెంకటనారాయణ గత ప్రభుత్వ వైఫల్యం కారణంగానే పౌల్ట్రీ రైతుల పన్నుల విషయంలో న్యాయం జరగలేదని పౌల్ట్రీ రైతుల తరపున వెంకటనారాయణ అన్నారు. గత 15 సంవత్సరాలుగా అనేకమంది మంత్రులకు ముఖ్యమంత్రులకు ఎమ్మెల్యేలకు మొరపెట్టుకున్న తమ మాట పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం నిరంకుశ ప్రభుత్వమని వెంకటనారాయణ విమర్శించారు. రైతుల సమస్యలు చెప్పడానికి సమయం అడిగితే అపాయింట్మెంట్ కూడా ఇవ్వలేని దుస్థితి నెలకొందని గత ప్రభుత్వం పై ఆరోపణలు చేశారు.

### హిందూ ధర్మ రక్షణకు మహిళా ముందుకు రావాలి

**బేగంబజార్, అక్టోబరు 26ప్రభాతవార్త:** హిందూ ధర్మ పరిరక్షణ కోసం మహిళలు ముందుకు రావాల్సిన అవసరం, బాధ్యత ఎంతైనా ఉందని తెలంగాణ భజరంగ్ సేనా మహిళా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కృష్ణవేణి ఒరుగంటి అన్నారు. ఈమేరకు తెలంగాణ భజరంగ్ సేనా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.ఆర్.లక్ష్మన్‌రావుగుప్త చేతుల మీదుగా ప్రధాన కార్యదర్శిగా కృష్ణవేణి నియామక ప్రతాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ మహిళా అధ్యక్షురాలు మనోజ్‌మొగులిద్ది, ప్రియాచారి, ఉమా దేవి, ఉషా తదితరులు పాల్గొన్నారు.

### అయోధ్య రామమందిరం నిర్మాణంపై పుస్తకం రావడం సంతోషం

**పాట్నా హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ నరసింహరెడ్డి**

**చిక్కడపల్లి అక్టోబరు 26 ప్రభాతవార్త:** అయోధ్య రామ మందిర నిర్మా ణం




విషయంలో న్యాయపరంగా ఎదుర్కొన్న అంశాల ఆధారంగా పుస్తక రూపంలో వెలుగులోకి తీసుకురావడం ఎంతో గొప్పగా ఉందని పాట్నా హైకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నరసింహరెడ్డి అన్నారు. ఆదివారం రూప పబ్లికేషన్స్ ఇండియా ఆధ్వర్యంలో కేసు ఫర్ రామ్ ది ఆంటోల్డ్ స్టోరీస్, అనిరుధ్‌శర్మ, శ్రీధర్ పోతరాజు రాసిన పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిధులుగా జస్టిస్ ఎల్.నరసింహరెడ్డి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్ వి.సుబ్రహ్మణ్యం హాజ రవగా ఈ పుస్తకాన్ని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ అఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షుడు ఆర్. రవి కుమార్ ఆవిష్కరించారు. జస్టిస్ ఎల్ నరసింహరెడ్డి మాట్లాడుతూ అయోధ్య రామమందిరానికి సంబంధించి న్యాయపరంగా పడ్డ కష్టాలు, చిక్కులు అధిగమించి చివరకు ధర్మం గెలిచింద న్నారు. ఎల్వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రామ మందిరం పట్ల అపరిమిత మైన భక్తి, నమ్మకంతో ఎన్నో కోర్టులలో గెలుచుకుని సాధించుకున్నామన్నారు.

## కన్హ శాంతివనంకు వచ్చిన మాజీ గవర్నర్ దత్తాత్రేయ..

### పివిఆర్ ఇంట్లో తేనేటి విందు
### గవర్నర్‌ను సన్మానించిన పివిఆర్ దంపతులు

**నందిగామ, అక్టోబరు 26 ప్రభాతవార్త:** నందిగామ మండలం చేగూరు కన్హ శాంతి వనంలో బిజెపి సీనియర్ నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి నివాసానికి మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ విచ్చేసి తేనేటి విందులో పాల్గొన్నారు.విష్ణువర్ధన్ రెడ్డి అన్న కూతురు డాక్టర్ నిహారిక వివాహానికి బండారు దత్తాత్రేయ హాజరు కాలేకపోయిన సందర్భంగా శనివారం రాత్రి విష్ణువర్ధన్ రెడ్డి స్వగృహానికి రావడం జరిగింది. గవర్నర్ కు అభినందనలు తెలుపుతూ విష్ణువర్ధన్ రెడ్డి రమాదేవి దంపతులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు విజయ్ బాస్కర్, పసుల నర్సింహా యాదవ్, మోహన్ సింగ్, చేగు సుధాకర్ అప్ప, బల్వంత్ రెడ్డి,నాయకులు అత్తాపురం మహేందర్ రెడ్డి, ఏదిరరాజు, ప్రతాప్ రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, బోయ అశోక్,అనిల్ కుమార్ గౌడ్ కరెడ్ల నరేందర్ రెడ్డి, రాజు నాయక్, కుమ్మరి మహేష్, వనం శ్రీనివాస్, తిరుపతి, రాములు, ప్రశాంత్ గౌడ్, శ్రవణ్ కుమార్, పోచయ్య,మురళి,గణేష్ నాయక్, రాఘవేందర్ గుప్త, తదితరులు పాల్గొన్నారు.



కన్హ శాంతి వనంలో దత్తాత్రేయను సన్మానించిన పివిఆర్ దంపతులు

## అంబేద్కర్ భవనానికి నిధులు మంజూరు చేయాలి



అలియాబాద్ మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్,పలువురు నాయకులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసి అంబేద్కర్ భవనానికి నిధులు మంజూరు ఇవ్వాలని కోరిన దృశ్యం

**శామీర్‌పేట, అక్టోబరు 26, ప్రభాతవార్త:** శామీర్‌పేట మండల కార్యాలయం వద్ద గల డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్మిస్తున్న అంబేద్కర్ భవన నిర్మాణం పూర్తి కోసం రూ.25లక్షలు మంజూరు ఇవ్వాలని అలియాబాద్ మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేశ్‌తో పాటు మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, పలువురు నాయకులు కలిసి కోరారు. ఆదివారం ఉదయం శామీర్‌పేట మండలం నుంచి పలువురు నాయకులు నగరంలోని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ నివాసంకు వెళ్లి శామీర్‌పేట మండల కేంద్రంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ భవన నిర్మాణం పూర్తి కోసం 25లక్షల రూపాయలు మంజూరు చేయాలని కలిసి వినతిపత్రంను వారు అందజేశారు. దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు బిఎన్ రాంమోహన్ ఆధ్వర్యంలో మంత్రిని కలిసి వారు కోరారు. అంబేద్కర్ భవన నిర్మాణం నిధుల కొరతతో అసంపూర్తిలో ఉండి నిర్మాణం పనులు ఆగినట్లు, దీనికి మరో 25లక్షల రూపాయలు నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు చేయాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కలిసి కోరినట్లు అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు తుంకి రమేష్ పేర్కొన్నారు. మంత్రి లక్ష్మణ్‌ను మర్యాద పూర్వకంగ ముందుగా కలిసి సన్మానించినట్లు తెలిపారు. అంబేద్కర్ భవన నిర్మాణం కోసం నిధుల మంజూరు కోసం సానుకూలంగ స్పందించినట్లు తుంకి రమేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు మేడ్చల్ ఎఎంసి డైరక్టర్ తుంకి బిక్షపతి, మండల కాంగ్రెస్ నాయకులు ఊరడి వెంకటేశ, కొమ్ము వినోద్, మునికొండ నవీన్, పిట్ల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మల్లన్నస్వామి కళ్యాణోత్సవం

### అన్నప్రసాద వితరణ

**ఘట్‌కేసర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఘణాపూర్‌లో ఆదివారం శ్రీమల్లన్నస్వామి పండుగ ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ వేముల మమత మహేశ్‌గౌడ్ నివాసంలో అర్చకుల మంత్రోచ్చారణాల మధ్య మల్లన్నస్వామి కళ్యాణం జరిపించారు. ప్రత్యేకంగా అలంకరించిన ముత్యాలపందిరిలో ఉత్సవమూర్తుల పసుపు, కుంకుమలతో అలంకరించి సాంప్రదాయ డప్పువాయిద్యాల శబ్దాల మధ్య పండుగ జరిపారు. ఈసందర్భంగా నిర్వహకులు మమత మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో విచ్చేసిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులను పసుపు బండార్ దిద్ది సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కళ్యాణం అనంతరం వచ్చిన నాయకులు స్వామిని దర్శించుకొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. పీర్జాదిగూడ మాజీ ఉపమేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, కీసరగుట్ట డైరక్టర్ సగ్గు అనిత, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరక్టర్ చిల్కూరి మచ్చేందర్‌రెడ్డి, సహకార సంఘం డైరక్టర్ జడిగె రమేష్, మాజీ సర్పంచులు బాలగౌని నర్సింహులుగౌడ్, నానావత్ రూప్‌సింగ్‌నాయక్, బద్దం గోపాల్‌రెడ్డి, వేముల సంజీవగౌడ్, మాజీ ఉపసర్పంచులు వేముల సత్తయ్యగౌడ్, బోనకుర్తి అర్జున్, వేముల పరమేశగౌడ్, మాజీ వార్డుసభ్యులు బొక్క ప్రభాకర్‌రెడ్డి, వేముల శ్రీనివాస్‌గౌడ్, మండల సువర్ణ, బర్ల అనిత, పైళ్ల లత, వేముల శంకర్‌గౌడ్, నానావత్ సురేశ్‌నాయక్, మండల కృష్ణగౌడ్, మెట్టు రమేశ, కీసరగుట్ట మాజీ డైరక్టర్ మెరుగు నరేశగౌడ, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, నాయకులు ముళ్లి జంగయ్యయాదవ్, కొత్త కిషోర్‌గౌడ్, వంగేటి ప్రభాకర్‌రెడ్డి, సింగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మాచ వరలక్ష్మి, రంజిత్‌రెడ్డి, వేముల గోవర్దన్‌గౌడ్, వేముల రాజుగౌడ్, సమతాయాదవ్, బొక్క సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఘనాపూర్‌లో మల్లన్నస్వామి కళ్యాణం నిర్వహిస్తున్న మమతమహేశ్‌గౌడ్

## రక్తదానం ప్రాణదానంతో సమానం: వైఎస్ఆర్

**ఘట్‌కేసర్, అక్టోబరు 26, ప్రభాతవార్త:** రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగులను కాపాడవచ్చని ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్‌లోని సెయింట్ అంథోనీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెల్విన్స్ ఫిట్‌నెస్ స్టూడియో సౌజన్యంతో ఫ్లెక్స్ ఫర్ హోప్ ద్వారా ఆదివారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. ఈసందర్భంగా దాతల నుంచి సేకరించిన రక్తయూనిట్లను శివానంద ఇంపాక్ట్ పెడియాట్రిక్ క్యాన్సర్ సెంటర్‌కు అందజేస్తామని నిర్వహకులు తెలిపారు. సమాజానికి తోడ్పాటుగా రక్తదానం చేయడం మంచి లక్షణమని అటువంటి దానాల్లో ప్రాణాలు కాపాడేంత శక్తివంతమైన రక్తదానం అత్యంత శక్తివంతమైదని సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షేక్ జహంగీర్, సెయింట్ అంథోనీస్ హైస్కూల్ అధ్యక్షులు జార్జ్‌క్విల్డన్, కారస్పాండెంట్ క్రిష్టియానాక్విల్డన్, మెల్విన్ ఫిట్‌నెస్ స్టూడియో నుంచి మెల్విన్ క్విల్డన్, అంథోనీస్ షేర్ అండ్ కేర్ ఫౌండేషన్ ప్రతినిధి మార్టినా క్విల్డన్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని సందర్శిస్తున్న మాజీ ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

## ప్రైవేటు ట్రావెల్స్‌లో పేలుడు పదార్థాలు రవాణా?

(మొదటి పేజీ తరువాయి)

అద్దం పడుతోంది. బస్సు ప్రమాదానికి మోటారు బైక్ నడుపుతున్న యువకుడని, ట్రావెల్స్ డ్రైవర్ కారణమని, లేదా ఓనరే బాధ్యుడని అధికారులు చర్యలు తీసుకొని చేతులు దులుపేసుకోనున్నారు. సంఘటన జరిగిన కొద్ది రోజుల్లోనే అంతా మరిచిపోతారు. మళ్లీ 'యథారాజా తథ ప్రజ'గా సాగుతుంది. ప్రమాదం జరిగిన బస్సులు అగ్నికి ఆహుతి కావడానికి పలు కారణాలు కనిపిస్తున్నాయి. ప్రత్యేకంగా బస్సుల్లో పేలుడు పదార్థాల రవాణా సాగుతున్నట్లు తెలుస్తోంది. లగేజీ కంపార్ట్‌మెంట్‌లో ఇల్లీగల్‌గా మొబైల్ ఫోన్లు, గనుల్లో పేల్చే డిటోనేటర్లు రవాణా చేస్తున్నట్లు సమాచారం. వాటిని బస్సుల్లోని లగేజీ కంపార్ట్‌మెంట్‌లో ఎక్కించేటపుడు ప్రయాణికులకు తెలియడం లేదు. బస్సు డ్రైవర్, సిబ్బందికే తెలుస్తోంది. ఒకవేళ వారికి కూడా తెలియకుండా ఏదో లగేజీ మాదిరిగా ప్యాకింగ్ చేసి రవాణా చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ పేలుడు వల్ల సంభవించే దానిని డామినో ఎఫెక్స్ అంటుంటారు. లకేజీ కంపార్ట్‌మెంట్‌పై భాగంలో ప్యాసింజర్ కంపార్ట్‌మెంట్ ఉంటుంది. ఫ్లోర్ ప్యానెల్ పటిష్టమంతంగా ఉంటే వెయ్యి డిగ్రీల మంటలు వ్యాపించినా పెద్దగా నష్టం వాటిల్లదని చెబుతున్నారు. మంటలు వ్యాపిస్తున్నట్లు గుర్తించి ప్రయాణికులను అప్రమత్తం చేయవచ్చు. సురక్షితంగా ప్రయాణికులను బయటకు వేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. కండీషన్ లేని బస్సుల్లో కంపార్ట్‌మెంట్ తగులబడి పోతుంది. ఎలక్ట్రికల్ కేబుల్ రంధ్రాల ద్వారా పొగలు ప్రవేశించి ప్రయాణికులను ఉక్కిరిబిక్కిరి అవుతారు. నిద్రలో ఉంటే ప్రాణాలకు అపాయం జరుగుతుంది. కండీషన్ బస్సుల్లో అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ఏసీ ఆటోమెటిగ్గా ఆగిపోతుంది. ఫైర్ టూ ఏసీ ఎంటర్ లాక్స్ వైఫల్యం జరిగి అగ్నికి ఆహుతి అవుతుంది. ప్రమాదాలు జరిగిన సమయంలో ఎమెర్జెన్సీ డోర్లు ఓపెన్ కావాలి. అందుబాటులో హ్యామర్లను కూడా ఏర్పాటు చేయాలి. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్ సురక్షితంగా ఉంటే ప్రయాణికులను అప్రమత్తం చేయాలి. కానీ కర్నూలు ప్రమాదం జరిగినప్పుడు డ్రైవర్ దూకి పారిపోయాడని తెలుస్తున్నది. బస్సులో ఫైర్ సేఫ్టీ పరికరాలు ఏర్పాటు చేసుకోవాలి.

### ప్రభుత్వాల బాధ్యత

రవాణా వ్యవస్థలను పటిష్టమంతంగా తీర్చి దిద్దాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రైవేటు ఓనర్లపై డ్రైవర్లపై చర్యలు తీసుకొని సరిపెట్టుకుంటారు. కానీ తరచూ సంఘటనలు వెలుగు చూస్తూ విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రభుత్వ నిర్వహణ కంటే ప్రైవేటు ట్రావెల్స్ వాహనాలే రోడ్లపై ఎక్కువగా తిరుగుతున్నాయి. దానివల్ల నియంత్రణ సాధ్యం కావడం లేదు. అదే ఆర్టీసీ బస్సులైతే రోజూ డిపోల్లో కండీషన్ పర్యవేక్షణ, డ్రైవర్ కండీషన్ పరిశీలించిన తర్వాతే రోడ్లపైకి వస్తుంటాయి. కానీ ప్రైవేటు వాహనాల నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. పటిష్టమంతంగా రవాణా వ్యవస్థ చేపట్టాలన్న నిబంధనలను గాలిలో కలిపేస్తున్నారు. మోటారు వెహికల్ చట్టం సరిగ్గా అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. జాతీయ రహదారిపై గంటకు 60 నుంచి 80 కిలోమీటర్ల వేగం పరిమితి విధించాలి. కానీ ఓనర్లు, డ్రైవర్లు స్పీడ్ లిమిట్‌ను తొలగించి గంటకు 120 కిమీ వేగంతో నడుపుతున్నారు. జాతీయ రహదారుల్లో మోటారు సైకిళ్లను, ట్రాక్టర్లను అనుమతించకూడదు.

వాటికి ప్రత్యేక కారిడార్ నిర్మించాలి. బైక్‌లకు సపరేట్‌గా, భారీ వాహనాలకు సపరేట్‌గా ట్రాక్ వేయాలి. అలాంటి రోడ్లు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా కనిపించవు. హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై మాత్రమే పలు నిబంధనలు అమలు చేస్తున్నాయి. జాతీయ రహదారులను నిర్మించిన సంస్థలు టోల్‌గేట్ ఏర్పాటు చేసి వాహనాల నుంచి దర్జాగా ఏళ్ల తరబడి ఫీజులు వసూలు చేస్తున్నాయి. కానీ రహదారులను నిబంధనల ప్రకారం సౌకర్యవంతంగా నిర్మించడం లేదు. రైల్వేస్‌లో ఎలాంటి ప్రమాదం జరిగినా విచారణ జరిపి ముందుగా శాఖ అధికారుల, సిబ్బందిపై చర్యలు తీసుకుంటారు. జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగితే రవాణాశాఖ, నేషనల్ హైవే అథారిటీస్ అధికారులపై చర్యలు తీసుకున్న దాఖలాలు కనిపించడం లేదు. రహదారులు నిర్మించిన కాంట్రాక్టర్ల, నిర్మాణ సంస్థలపై కూడా చర్యలు తీసుకోవాలని న్యాయ నిపుణులు అంటున్నారు.

### ప్రయాణికులూ.. ఇవి చూసుకోండి

చలానాలు ఉన్న బస్సులపై రవాణాశాఖ, పోలీసుశాఖలు చర్యలు తీసుకోవాలి. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెంట్ లేకుంటే చాలానాలు వేసే అధికారులు నిబంధనలపై పట్టించుకోవడం లేదు. దూర ప్రాంతాలకు ప్రయాణించే వారు ఆన్‌లైన్‌లో టిక్కెట్ తీసుకున్న బస్సు ప్రమాణాలను కూడా తెలుసుకోవాలి. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పొందుపరిచిన విధంగా బస్సు కండీషన్ ఉందా లేదా చూసుకోవాలి. బస్సుల రేటింగ్ బాగా ఉంటేనే దూర ప్రాంతాలకు ప్రయాణించాలి. ఓనర్ రిజిస్ట్రేషన్, బస్సు ఫిట్‌నెస్, స్పీడ్ గవర్నర్ కాంప్లెక్ పరిశీలించాలి. సదరు వాహనాలు టాక్స్ చెల్లిస్తున్నాయా, ఇన్సూరెన్స్ తదితర వివరాలను అధికారిక వెబ్‌లో చెక్ చేసుకోవాలి. కొన్ని సంస్థలు స్కూలు బస్సులనే ట్రావెల్స్‌కు ఉపయోగిస్తున్నట్లు తెలిసింది. అలాంటి వాటినీ చెక్ చేసే బాధ్యత అధికారులపైఉంది. ట్రావెల్స్‌లో సీటర్ బస్సులను, స్లీపర్ కోచ్‌లను, జీపీఎస్ ట్రాకింగ్ సరిగ్గా ఉందా లేదా తెలుసుకోవాలి. ప్రభుత్వ నిబంధనల దాని స్టాండర్డ్స్ పరిశీలించాలి. వాహనాలను ఆధునీకరించిన తర్వాత అగ్నిమాపక శాఖ ద్వారా అనుమతులు పొందాలి. ప్రత్యేకించి బస్సు ఎక్కడ రిజిస్ట్రేషన్ జరిగిందనేది చాలా ప్రధానమైనది. తక్కువ ఛార్జీలు ఉంటాయనే కక్కుర్తితో కేంద్ర పాలిత ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ చేసుకొని ఇక్కడ పర్మిట్లు పొందుతుంటారు. ఇవన్నీ గుర్తించి సురక్షితమైన ప్రమాదానికి బాటలు వేసుకోవాలని నిపుణులు సలహాలు, సూచనలు ఇస్తున్నారు.



యాదవ సంఘం నాయకులతో ఎమ్మెల్యే శంకర్

## రాజకీయాలకు అతీతంగా "సదర్" చేద్దాం..!

### షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"

**షాద్‌నగర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** మాట ఇస్తే నీతి, నిజాయితీగా మడమతిప్పకుండా నిలబడే జాతి యాదవ కులస్తులని వారు అనాదిగా చేస్తున్న సాంప్రదాయక సదర్ సమ్మేళనం కార్యక్రమం విజయవంతంగా కొనసాగాలని రాష్ట్ర ప్రభుత్వం తరపున అదేవిధంగా నియోజకవర్గంలో తన తరపున పూర్తి సహాయ సహకారాలు సదర్ కార్యక్రమానికి ఉంటాయని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్ నగర్ సదర్ ఉత్సవ కమిటీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ (దంగు), అఖిలభారత యాదవ మహాసభ తాలూకా అధ్యక్షులు షాబాద్ మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం నాయకులు రాజకీయాలకు అతీతంగా పెద్ద ఎత్తున కార్యక్రమానికి తరలివచ్చారు. నవంబర్ 2న షాద్ నగర్ పట్టణ కేంద్రంలో పోలీస్ స్టేషన్ పక్కన మెయిన్ రోడ్డులో జరిపే దున్నపోతుల విన్యాసం సదర్ పండుగకు సంబంధించిన కరపత్రాలను ఎమ్మెల్యే శంకర్ చేతుల మీదుగా విడుదల చేశారు. అదేవిధంగా దానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు సదర్ పండుగ కోసం యాదవ సోదరులు ఆహ్వానం అందజేశారు. నవంబర్ 2 సాయంత్రం 6 గంటలకు జరిగే సదర్ పండుగ వేడుకలు విజయవంతం చేయాలని రాజకీయాలు కచ్చితంగా ప్రతి యాదవుడు కదలి రావాలని ఎమ్మెల్యే శంకర్ పిలుపునిచ్చారు. రాజకీయాలు ఉంటాయి పోతాయి అని అవి శాశ్వతం కాదని ఐక్యమత్యంతోనే అభివృద్ధి సాధించవచ్చు అని అన్నారు. యాదవులు ఎంతో నిజాయితీ కలవారు అని మాట ఇస్తే తప్పని యాదవులంటే తనకు ఎంతో గౌరవం అని ఆయన అన్నారు. సదర్ కార్యక్రమాలు రాజకీయాల్లో కచ్చితంగా జరగాలని తాను ఆకాంక్షి స్తున్నట్లు తెలిపారు. అనవసరంగా దుందడుగు చర్యలతో వివాదాల జోలికి వెళ్ళకూడదని ఆయన పేర్కొన్నారు.తాను యాదవుల గురించి తెలుసుకున్న గొప్ప విషయం గురించి వివరిస్తు.. భగవంతుడు మాట ఇస్తే తప్పొచ్చేమో కానీ యాదవ సోదరులు మాట ఇస్తే తప్పరని ఎమ్మెల్యే శంకర్ యాదవ సోదరుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. గత పది సంవత్సరాలలో యాదవ సోదరులు రాజకీయాలకు అతీతంగా ఎవరికి వత్తాసు పలకకుండా నీతి నిజాయితీగా నిలబడ్డారని గుర్తు చేశారు. గొల్ల కురువలు భగవంతునితో సమానమని మాట ఇస్తే తప్పని వారిని కొనియాడారు. అనంతరం ఎమ్మెల్యే శంకర్ తోపాటు మీడియా ప్రతినిధులకు పలువురికి అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సన్మానం జరిపారు. ఈ సందర్భంగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ యాదయ్య యాదవ్ లక్ష రూపాయల నగదు యాదవ సంఘానికి సదర్ నిర్వాణ కోసం అందజేశారు. కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున విజయవంతం చేయాలని శ్రీనివాస్ యాదవ్ మీడియాతో పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లనమోని యాదయ్య యాదవ్, సదర్ కమిటీ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి నడికూడ రఘునాథ్ యాదవ్, షాద్ నగర్ తాలూకా అధ్యక్షుడు షాబాద్ మల్లేష్ యాదవ్, సదరు కమిటీ మాజీ అధ్యక్షులు నడికూడ యాదగిరి యాదవ్, అఖిల భారత యాదవ మహాసభ మున్సిపాలిటీ టౌన్ అధ్యక్షుడు నక్క బాల్ రాజ్ యాదవ్, కేశంపేట మండల అధ్యక్షుడు పసుల నర్సింలు యాదవ్, జంగా నరసింహులు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు పద్మారం వెంకటేష్ యాదవ్, ప్రభుత్వ పిపి అంజయ్య యాదవ్, అడ్వకేట్ చీపిరి చంద్రశేఖర్ యాదవ్, శ్రీశైలం యాదవ్, మాధవులు యాదవ్, ఆలుగడ్డ ప్రవీణ్ యాదవ్, యువత జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, అంజయ్య యాదవ్, రిపోర్టర్ దోంద్ర ప్రవీణ్ యాదవ్, అంజి యాదవ్, చీపిరి శివరాములు యాదవ్, రాజు యాదవ్, మల్లేష్ యాదవ్, అనీల్ యాదవ్, లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జిల్లా స్థాయిలో మద్యం షాపుల ఎంపికకు డ్రా

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని మేడ్చల్ యూనిట్‌లోని 118మద్యం షాపులకు, మల్కాజ్‌గిరి యూనిట్‌లోని 88మద్యం షాపులకు 27న సోమవారం ఉదయం 11గంటలకు ఫీర్జాదిగూడలోని శ్రీవలనీ కన్వెన్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ మనుచౌదరి సమక్షంలో మద్యం షాపుల ఎంపికకు డ్రా లాటరీ పద్దతిలో తీయబడుతుందని దీనికి సంబంధించి జిల్లా ఆబ్కారి శాఖ సంబంధిత అధికారులు పేర్కొన్నారు. మద్యం షాపుల ఎంపిక కోసం డ్రా తీయటానికి తగు అన్ని ఏర్పాట్లు సిద్దం చేసినట్లు తెలిపారు. మద్యం షాపుల ఎంపిక నిర్వహిస్తున్నందున ధరఖాస్తుదారులు తప్పనిసరి దీనికి హాజరు కావాలని వారు సూచించారు. అందరూ కూడ ఉదయం 9గంటలలోపు శ్రీవలనీ కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. మొబైల్ ఫోన్లు మాత్రం లోపలికి అనుమతించబడవని తెలియజేశారు. మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగ 10వేలకు పైగానే మద్యం షాపుల కోసం పలువురు ధరఖాస్తులు చేసుకున్న సంగతి తెలిసిందే. గత నెల 26వ తేదీ నుంచి ఈ నెల 23వ తేదీ వరకు మద్యం షాపుల కోసం ధరఖాస్తులు స్వీకరించిన సంగతి తెలిసిందే. ఒక్కొక్క ధరఖాస్తుకు 3లక్షల రూపాయలు చొప్పున ఫీజు డిడి చలాన్‌తో మద్యం షాపుల కోసం ధరఖాస్తుల్లు స్వీకరించటం జరిగింది.

## జీలకర విష్ణు ఇటీవల ఆకస్మిక మరణంతో కుటుంబానికి రూ.50వేలు ఆర్థిక సాయం

**శామీర్‌పేట, అక్టోబర్ 26, ప్రభాతవార్త :** శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘం డైరక్టర్ జిలకర విష్ణు ఇటీవల ఆకస్మిక మరణంతో బాధిత కుటుంబాన్ని ఆర్థికంగ ఆదుకోవటానికి ఆ సొసైటీ చైర్మన్ డా.ఆర్.మధుకర్‌రెడ్డి రూ.50వేలు ఆర్థిక సహాయంను అందజేశారు. మూడుచింతలపల్లి మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన డైరక్టర్ జిలకర విష్ణు ఇటీవల మృతిచెందటంతో బాధిత కుటుంబాన్ని ఆదుకోవటానికి ఆయన నివాసంకు చైర్మన్, పలువురు డైరక్టర్లు, మాజీ చైర్మన్,పలువురు నాయకులు వెళ్లారు. అయితే డైరక్టర్ జిలకర విష్ణు ఆకస్మిక మరణంతో ఆ బాధిత కుటుంబం తీవ్రమైన విషాదంలో ఉందని, వారి కుమార్తె వివాహం సందర్భంగా ఎదురైన ఆర్థిక ఇబ్బందులను గుర్తించి చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి స్వయంగా ముందుకు వచ్చి 50వేల రూపాయలు ఆర్థిక సహాయంను అందజేశారు. ఈ సందర్భంగా శామీర్‌పేట సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ కుటుంబం అనేది కేవలం రాజకీయ బంధం కాదని, మన సహచరులు ఎవరైనా కష్టాల్లో ఉన్నపుడు అందరం ఒక్కటిగా ఉంటామన్నారు. ఒకరి బాధ, అందరి బాధ అని అదే బిఆర్ఎస్ ఆత్మ అని అన్నారు. బాధిత కుటుంబానికి తమ పూర్తి సహకారం ఉంటుందని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు సొసైటీ మాజీ చైర్మన్ వంగ పెంటారెడ్డి, మూడుచింతలపల్లి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు జి.మల్లేశ్‌గౌడ్, నారాయణపూర్ గ్రామ మాజీ సర్పంచు రాంచంద్రయ్య, శామీర్‌పేట మండల బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి పి.సతీష్‌రెడ్డి, సొసైటీ వైస్‌చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్, డైరక్టర్లు చంద్రకళ, కె.బిక్షపతి, బావుసింగ్, ఎల్.నర్సింలుగౌడ్, వి.భూమిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, మరి కొందరు, మాజీ సర్పంచులు విష్ణువర్దన్‌రెడ్డి, సింగం అంజనేయులు, వి.హరిమోహన్‌రెడ్డి, మండల నాయకులు బుద్ది అంజనేయులు, గ్రామ పార్టీ అధ్యక్షులు బుద్ది లక్ష్మయ్య, పలువురు గ్రామ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘట్‌కేసర్ రజక సంఘం కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన రజక సంఘం కార్యవర్గం

ఘట్‌కేసర్, అక్టోబర్ 26, ప్రభాతవార్త: ఘట్‌కేసర్ రజక (చాకలి) సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. రజక సంఘం భవనంలో జరిగిన సమావేశంలో అందరితో చర్చించి నూతన కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షులుగా పొట్లచెరువు శ్రీరాములు, ఉపాధ్యక్షులుగా గొల్లపల్లి అంజనేయులు, ప్రధానకార్యదర్శిగా పొట్లచెరువు శరత్, కోశాధికారులుగా కుందం రాము, పొట్లచెరువు సంపత్, కార్యదర్శిగా కుందం వెంకటేశ, సలహాదారులుగా పగిడి అంజనేయులు, బోయపల్లి కృష్ణ, కుందం రాజు, పొట్లచెరువు పాండు, కుందం శేఖర్, పెద్దోళ్ల ప్రకాష్‌లు ఎన్నిక అయ్యారు. ఈసందర్భంగా నూతన అధ్యక్షులు శ్రీరాములును శాలువాతో సన్మానించి అభినందించారు.

